క్లుప్తంగా

సహకార జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న వెంకటసుబ్బారావు

ఉలవపాడు: ఉలవపాడులోని ఆది ఆంధ్ర ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆదివారం జెండా ఆవిష్కరించారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం చాగల్లు, ఆదివారం ఉలవపాడులో జెండాలను ఆవిష్కరించారు. 102వ అంతర్జాతీయ సహకార దినం నిర్వహించారు. సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కంద్రాతి వెంకటసుబ్బారావు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీఈఓ లు ఏసురత్నం, తిప్పేనేని తిరుమల, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పామూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం స్థానిక డీవీపాలెం ఎస్సీకాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బంకా యేబు, రాచూరి ప్రకాశం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంధం భాస్కర్, బండారు సాల్మన్‌బాబు, అంగలకుర్తి మనోహర్, రాచూరి యనోష్, బంక ఎఫ్రాయం, కొల్లూరి చిన్న, భానుప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

సీపీఐ మార్గదర్శకుడు సవడారెడ్డి

కందుకూరు: కందుకూరు సీపీఐ మార్గదర్శకుడిగా సవడారెడ్డి పోషించిన పాత్ర ఎనలేనిదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు అన్నారు. సీపీఐ నాయకులు కుర్రా సవడారెడ్డి 27వ వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవడారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లో సీపీఐ పార్టీని గ్రామ గ్రామాన విస్తరించడంలో సవడారెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. నాడు మంత్రి, శాసనసభ్యులుగా ఉన్న చెంచురామానాయుడు, రోశపనాయుడులు ఆక్రమించిన భూములను పేదలకు పంచడంలో ఎన్నో పోరాటాలు చేశారని, అలాగే కందుకూరు ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఎంతో కృషి చేశారని వివరించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా గుర్తింపు పొందారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా, కందుకూరు తాలూకా సీపీఐ కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. సవడారెడ్డి స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో పేదల పక్షాన పోరాటాలు చేస్తామని వివరించారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు.

మట్టి మాఫియాతో చెరువులు గుల్ల



భారీ యంత్రాలతో మట్టి తవ్వుతున్న దృశ్యం



మట్టి తరలింపుతో భారీ గుంతలు పడిన చెరువు

● అధికారుల చర్యలు శూన్యం

కొండపి (సింగరాయకొండ):

మట్టి మాఫియా రోజురోజుకూ చెలరేగిపోతుండటంతో చెరువులు గుల్లవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్ల స్థలాలు మెరక లేపేందుకు, ఇటుక తయారీకి, పలు రకాల పనులకు చెరువుల మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలతో గోతులు తవ్వి మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టి మాఫియా యజమానులు కోట్లకు పడగలెత్తుతున్నారు. కొండపిలో గత కొంత కాలంగా మట్టిమాఫియా అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన కొండపి చెరువు నుంచి చుట్టుపక్కల గ్రామాలకు అధికార బలంతో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ఇటీవల స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడలేదంటే మర్మం ఏమిటా అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరిగేషన్ ఏఈ మధుబాబు వివరణ...

చెరువులో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటాం. మట్టి తవ్వకాలకు ఎవ్వరికీ ఎటువంటి అనుమతులు లేవు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

కనిగిరి రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఊరువాడా వేడుకలా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ ఆదివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖ్యమంత్రిగా పనిచేసి ఆరోగ్యశ్రీ, 108 వంటి ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలను పేద ప్రజల కోసం అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన సంక్షేమాన్ని కొనసాగిస్తూ గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఆ మహానేత రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రాలు, గ్రామాల్లో నాయకులు ఘనంగా నిర్వహించాలని సూచించారు. కనిగిరి పట్టణంలోని చెక్‌పోస్టు, గార్లపేట రోడ్డు, చింతలపాలెం, కొత్తూరు, వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కాశిరెడ్డి కాలనీలో ఎస్టీ మహిళలకు చీరల పంపిణీ, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఎస్ఆర్ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కనిగిరి జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పీసీపల్లి జెడ్పీటీసీ ఓకేరెడ్డి, మండల అధ్యక్షుడు బొర్రా రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సూరపనేని మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సేవాదళ్ నాయకులు శ్రీహరిరెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కౌన్సిలర్ రాజీవ్, మాలకొండారెడ్డి, రమేష్‌రెడ్డి, మహిళా నాయకులు భారతి, నాగమణి, షకీలా, నాగూర్‌బి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాద్దాల

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలతో గోపూజ చేశారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో ఏపీ అసెంబ్లీ సెక్షన్ జాయింట్ సెక్రటరీ వెంకటసుబ్బారెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు స్వామి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయంలో దద్దాల దంపతుల పూజలు



నారాయణస్వామివారి పూజల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ దద్దాల దంపతులు



దద్దాల దంపతులను సన్మానించిన ఆలయ కమిటీ

సీఎస్‌పురం(పామూరు):

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, మంజుభార్గవి దంపతులు ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు డాక్టర్ దద్దాలకు వేద ఆశీర్వచనం చేసి శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు తరలిరండి

ఉలవపాడు: ఉలవపాడులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలలో పాలు, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

లింగసముద్రం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు కేక్ కట్ చేస్తామన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పామూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, బూత్ కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు కందుకూరు రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం, అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్‌కటింగ్ ఉంటుందన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాదిగ జనజాతర సభకు తరలిన ప్రజలు



మర్రిపూడిలో మాట్లాడుతున్న పవన్ కుమార్

మర్రిపూడి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు మేరకు 30 ఏళ్ల ఉద్యమ జనజాతర మహాసభకు ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ఒనుకూరి పవన్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి మాదిగలు, యువకులు తరలివెళ్లారు. ఆదివారం నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల జనజాతర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమం కేవలం వివిధ రాజకీయ పార్టీలకు తాకట్టుపెట్టడానికే సరిపోయిందని, మాదిగ మేధావులు, యువకులు మాదిగల ఉనికిని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న విజయానంద్

సింగరాయకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రాంగణంలో ఆదివారం ఎంఆర్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.విజయానంద్ మాట్లాడుతూ మాదిగల ఉపకులాలకు సమాన వాటా కోసం ఉద్యమం ప్రారంభించిన మందకృష్ణ మాదిగ.. ఆ తర్వాత సమాజంలోని అన్ని వర్గాల సమస్యలపై పోరాటం చేసి విజయం సాధించారన్నారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, వికలాంగుల హక్కులకు, అత్యాచార బాధితులకు న్యాయం చేయడం కోసం ఆయన పోరాటాలు చేసి విజయం సాధించారని కొనియాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లాయర్ గొడపేరు కోటేశ్వరరావు, రేణుమాల పోతురాజు, చంద్రమాదిగ, రేణుమాల మణి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

● రూ.10 వేల జరిమానా



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో సెబ్ సిబ్బంది

జరుగుమల్లి (సింగరాయకొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్‌తో సహా సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరుగుమల్లి మండల కేంద్రంలో జరిగింది. సెబ్ పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన ఆదిపోగు కిషోర్‌బాబు ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. మొదటి తప్పుగా అతనికి రూ.10 వేల జరిమానా విధించి వసూలు చేసినట్లు సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్ తెలిపారు. సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధనరాజు మాట్లాడుతూ చదవడం మాకిష్టం లాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత పెంపొందిస్తాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలను పుస్తకాలు చదివేలా అలవాటుచేస్తాయన్నారు. చక్కగా కథలు చెప్పడం, హిస్టరీ పుస్తకాలు, దైవగ్రంథాలు చదవడం వంటివి పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



పిక్కిలి చిన్నపుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు

కొమరోలు: తీవ్రవాదుల దాడిలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన పిక్కిలి చిన్నపుల్లయ్యకు స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఘననివాళి అర్పించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిక్కిలి చిన్నపుల్లయ్య 1998లో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో వీరోచితంగా పోరాడి జూలై 7వ తేదీన వీరమరణం పొందాడు. కాగా ఢిల్లీ సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఆదేశాల మేరకు కొమరోలు ఎస్సై మధుసూదన్‌రావు, సర్పంచ్ వెంకటేశ్వర్లు నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పిక్కిలి చిన్నపుల్లయ్య నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

శాకంబరిగా కోట సత్యమాంబదేవి




బేస్తవారిపేట: శాకంబరిదేవిగా కోటసత్యమాంబదేవి



బేస్తవారిపేట: శాకంబరుడిగా సత్యమణికంఠేశ్వరుడు



మార్కాపురం : భక్తులకు దర్శనమిస్తున్న ముద్దసానమ్మ అమ్మవారు



మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా వర్షాలు పడి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా, సత్యమణికంఠేశ్వరస్వామిని శాకాంబరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో వెలసిన ముద్దసానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఆదివారం ముద్దసానమ్మకు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని తమ కష్టాలు తీర్చాలని అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజల గ్రామ ఇలవేల్పు అయిన అల్లూరి పోలేరమ్మ తల్లిని ఆదివారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ బండ్లతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

విశ్వబ్రాహ్మణుల కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

హనుమంతునిపాడు: విశ్వబ్రాహ్మణుల మండల నూతన కార్యకవర్గ సంఘ సభ్యులు ఎంపిక ఆదివారం నిర్వహించారు. సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అధ్యక్షతన జరిగింది. సంఘం ఏకగ్రీవంగా తీర్మానించి మండల విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గ సంఘ అధ్యక్షునిగా వాగుమడుగు నారాయణచారి, ప్రధాన కార్యదర్శిగా సోడా శివబ్రహ్మచారి, కోశాధికారిగా పాలూరిశ్రీనివాసాచారి, గౌరవ అధ్యక్షునిగా పోతురాజు వీరబ్రహ్మం, సలహాదారులుగా ఆకుమల్ల నాగబ్రహ్మం, సోడా మేఘనాథంతో పాటు 10 మంది సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు వాగమడుగు నారాయాణచారి మాట్లాడుతూ మండలంలో విశ్వబ్రాహ్మణుల సంఘ అభివృద్ధికి కృ షి చేస్తానన్నారు. కార్యక్రమంలో కనిగిరి అధ్యక్షుడు ప్రకాశరావు, జిల్లా సంఘనాయకులు బ్రహ్మనందం, సుధాకర్, మాల్యాద్రి పాల్గొన్నారు.